## క్లుప్తంగా

### ఓటరు జాబితాపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలోమ్

హుస్నాబాద్: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఓటర్ జాబితాపై బుధవారం ఆర్డీఓ బెన్‌షాలోమ్ అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సిద్దిపేటజోన్: ఓటర్ తుది జాబితా రూపకల్పన ప్రక్రియలో భాగంగా బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా పరిశీలకురాలు విజేయింద్ర బోయి నిబంధనలు వివరించారు. సమావేశంలో ఆర్డీఓ రమేశ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, అర్బన్ తహసీల్దార్ దిలీప్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో భారీగా చేరికలు

రాయపోలు(దుబ్బాక): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో మండలానికి చెందిన ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. రాయపోలు వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ రంగమ్మ, దౌల్తాబాద్ మాజీ వైస్ ఎంపీపీ తలారి నర్సింహులు, ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మణ్, కొత్తపల్లి, టెంకంపేట ఉప సర్పంచ్‌లు మల్లేషం, మాణికతో పాటు చిన్న మాసాన్‌పల్లి, కొత్తపల్లి, లింగారెడ్డిపల్లి, టెంకంపేట, రామారం, ఉదయపూర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. వీరికి కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు, రవీందర్‌రెడ్డి, నాయకులు రాజాగౌడ్, మంకిడి స్వామి, రామస్వామి గౌడ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పాలనలోనే పేదలకు లబ్ధి

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పాలనలోనే పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జి కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వీరాపూర్, తలారువానిపల్లె గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు ప్రజాహిత పథకాలు అమలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పూలే గురుకుల కళాశాలలో ఫ్రెషర్స్ డే

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు 'కుహూ' పేరుతో నూతన విద్యార్థినులకు ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమానికి హైదరాబాద్ కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితారెడ్డి, ఏజీఓ లక్ష్మయ్య, ఆర్సీఓ ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, వీపీ గోవిందరావు, ఇన్‌చార్జి ఏటీపీ ఉమామహేశ్వరి, డీడబ్ల్యూజీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా కాన్పూర్ ఐఐటీలో 'సైబర్ సెక్యూరిటీ కోర్స్' నేర్చుకునేందుకు వెళుతున్న 14 మంది విద్యార్థినులకు సెక్రెటరీ మల్లయ్య భట్టు రూ.5 వేల చొప్పున అందజేశారని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

### సభ్యుల్లేక ఆలస్యంగా సభ ప్రారంభం

దౌల్తాబాద్(దుబ్బాక): ఎంపీపీ గంగాధరి సంధ్య ఆధ్వర్యంలో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం సభ్యులు సకాలంలో రాకపోవడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. ఏడుగురు ఎంపీటీసీల్లో ఎంపీపీతోపాటు మరో ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ముందుగా మండల వ్యవసాయశాఖ అధికారి గోవిందరాజులు రుణమాఫీపై చదివేటప్పుడు గాజులపల్లి సర్పంచ్ అప్పావారి శ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రుణమాఫీ ప్రక్రియ సరిగా తెలియపరచకపోవడంతో రైతులు అయోమాయనికి గురవుతున్నారని మండిపడ్డారు. అలాగే వైద్యారోగ్య శాఖ, మిషన్ భగీరథ అధికారుల పనితీరు సరిగా లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రాజేశ్ కుమార్, జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ చైర్‌పర్సన్ ఇప్ప లక్ష్మీ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు కొండా లక్ష్మణ్

అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని వక్తలు స్మరించుకున్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయంలో సీపీ శ్వేత ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు.



సిద్దిపేటకమాన్: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీ శ్వేత, పోలీసు అధికారులు



హుస్నాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అక్కన్నపేటలో లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న నాయకులు



దుబ్బాక: కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న చేనేత సంఘం నాయకులు, కార్మికులు



చేర్యాల(సిద్దిపేట): బాపూజీకి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు



గజ్వేల్‌లో బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కోహెడలో మండల పరిషత్ కార్యాలయంలో బాపూజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కీర్తి



బెజ్జంకిలో బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నిర్మల, సర్పంచ్‌లు



సిద్దిపేటకమాన్: బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



హుస్నాబాద్‌రూరల్: బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ మానస

# పురుగు నివారణకు పిచికారీ చేస్తే..

**వంట ఎండిందని యువ రైతు ఆవేదన**



పత్తి పంటను చూపుతున్న రైతు మల్లేశం

జగదేవ్‌పూర్(గజ్వేల్): రసం పీల్చే పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తే పంట ఎండిపోయిందని ఓ రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన రైతు ఎల్లం మల్లేశం తనకున్న ఎకరంలో పత్తి పంటను సాగు చేస్తున్నాడు. మొక్కలు ఏపుగా పెరిగాయి. అయితే మొక్కలకు రసం పీల్చే పురుగు ఆశించింది. దీంతో పురుగు నివారణకు మూడు రోజుల క్రితం ప్రొఫెక్స్, కాన్ఫిడార్ కలిపి పిచికారీ చేశాడు. రెండు రోజుల తర్వాత ఆకులు పూర్తిగా మాడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మందుల దుకాణానికి వెళ్లి డీలర్‌ను నిలదీయగా మందుల ప్రభావం కాదని నచ్చజెప్పి మరో మందు మోనోక్రోటోఫాస్ ఇచ్చి పిచికారీ చేయమని చెప్పినట్లు తెలిపాడు. దీంతో బుధవారం మళ్లీ పిచికారీ చేశాడు. నకిలీ మందుల వల్లనే తన పంట మాడిపోయిందని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. పంట సాగుకు 30 వేల వరకు పెట్టుబడి పెట్టానని ఇప్పుడు పెట్టుబడి కూడా రాని దుస్థితి ఉందని వాపోయాడు. ఇదే విషయాన్ని మండల వ్యవసాయ అధికారిని వసంతరావును వివరణ కోరగా పిచికారీ డబ్బాలో అంతకు ముందు గడ్డి మందు కొట్టి డబ్బాను శుభ్రం చేయకుండా మందు పిచికారీ చేస్తే గడ్డిమందు ప్రభావం చూపుతుందన్నారు. అయితే పంటను పరిశీలిస్తామని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



ఎల్లమ్మ దేవాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది

హుస్నాబాద్: స్వచ్ఛ హుస్నాబాద్‌గా మార్చేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. వరల్డ్ టూరిజం డే సందర్భంగా ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ వారియర్స్ సభ్యులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు దేవాలయ ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ పట్టణానికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పట్టణంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌లో స్టీల్ వస్తువులను వాడాలని కోరారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పూదరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యుడు అయిలేని శంకర్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని ముత్తన్నపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని ముత్తన్నపేటలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో బుధవారం ర్యాలీ తీశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజేందర్, ఉపసర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ పొత్తురి అంజయ్య, వనిత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకరిస్తే డివిజన్ వచ్చేది

**మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లింగయ్య**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి సహకరిస్తే రెవెన్యూ డివిజన్ ఎప్పుడో వచ్చేదని చేర్యాల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లింగయ్య అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 17వ రోజుకు చేరాయి. బుధవారం దీక్షకు 2001–02 బ్యాచ్ పెద్దమ్మగడ్డ పాఠశాల విద్యార్థులు సంఘీభావం తెలిపారు. దీక్ష నిర్వహణకు చేర్యాల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లింగయ్య రూ.10 వేలు, విశ్రాంత డీఈ గుస్క సత్యనారాయణ రూ.5 వేలు, దీక్షలో కూర్చున్న పెద్దమ్మగడ్డ విద్యార్థులు రూ.5వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్, జేఏసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అమృత కలశ ర్యాలీలు



తిగుల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అమృత కలశయాత్రలో గౌరారం విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తిగుల్ గ్రామంలో విద్యార్థులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనసూయ మాట్లాడుతూ భారత దేశం గొప్పదనంపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. భరత మాత వేషధారణతో విద్యార్థిని, మహనీయుల ఫొటోలతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

**గౌరారంలో అమృత కలశయాత్ర**

వర్గల్(గజ్వేల్): మేరీ మిట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గౌరారంలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అమృత కలశ యాత్ర నిర్వహించారు. మట్టిపాత్రలో శుద్ధమైన మట్టిని సేకరించి అమృత కలశంగా అలంకరించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు, జాతీయ జెండాతో ప్రభాతభేరీ నిర్వహించారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనోహర్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి**

దుబ్బాక: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని కౌన్సిలర్లు దుబ్బాక బాలకృష్ణ గౌడ్, కనకయ్య అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేరీ మిట్టీ మేరా దేశ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు మేరా మిట్టీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెలు పంపిణీ చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జగత్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా కార్యదర్శి ఆలేటి యాదగిరి మాట్లాడుతూ గొర్రెల పంపిణీ పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. జిల్లాలో సుమారు 6 వేల మంది గొల్ల కురుమలు అప్పులు చేసి డీడీలు కట్టారన్నారు. నెలలు గడుస్తున్న ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

# పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

మద్దూరు(హుస్నాబాద్): ఎదుగుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చేర్యాల సీడీపీఓ శారద అన్నారు. బుధవారం మండలంలోని లద్నూరు గ్రామంలోని రైతువేదికలో పోషణ అభియాన్‌లో భాగంగా పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం చిరుధాన్యాల వినియోగంపై అధికారులు, ప్రజాప్రతినిధులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పలత, సర్పంచ్ జీడికంటి సుదర్శన్, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలం

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్**

చేర్యాల(సిద్దిపేట): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్ అన్నారు. బుధవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బొజ్జ బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# దిగజారుడు రాజకీయాలు మానుకోండి

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ మహిళా సంఘాల సభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ సమావేశాలకు రావాలని ఆ పార్టీ నాయకులు ఫోన్ చేసి బెదిరించడం సరికాదని దుబ్బాక మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన ప్రభాకర్ రెడ్డి మహిళా సమస్యలను కనీసం పట్టించుకోలేదని, ఇప్పుడు పార్టీ సమావేశాలకు రావాలని ఫోన్లు చేసి బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దిగజారుడు రాజకీయాలు మానుకోకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

# శోభాయాత్రలు.. నిమజ్జనాలు

గణేశ్ నవరాత్రులు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. బుధవారం కొన్నిచోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనం సందర్భంగా గణేశ్ శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపులో చిన్నా పెద్ద నృత్యాలు చేశారు. మహిళలు ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులకు మంగళహారతులు ఇచ్చి వెళ్లి రావయ్య బొజ్జ గణపయ్య అంటూ వీడ్కోలు పలికారు.



సిద్దిపేటఅర్బన్: వినాయకుడిని నిమజ్జనం చేసేందుకు తీసుకువెళుతున్న ఐటీ ఉద్యోగులు



మల్లన్న పుష్కరిణిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ఆలయ అర్చకులు



హుస్నాబాద్: చిప్స్ ప్యాకెట్లతో వినాయకుడికి అలంకరణ



చిన్నకోడూరులో ఎల్లమ్మ దేవాలయంలో ఏర్పాటుచేసిన మండపంలో వినాయకుడు



దుబ్బాకలో వినాయక నిమజ్జన ఊరేగింపులో నృత్యం చేస్తున్న యువకులు

## సంక్షిప్త వార్తలు

**◆ మైనర్లు వాహనాలు నడపొద్దు**

నంగునూరు(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడపడం చట్టప్రకారం నేరమని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. బుధవారం రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నియమాలు, మైనర్లు వాహనాలు నడిపితే పడే శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశలో రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

**◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రాంసాగర్ గ్రామంలో రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ తాడూరి రవీందర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విజయ బాలకృష్ణ, వార్డు సభ్యులు చెట్టిపల్లి మల్లారెడ్డి, తాడూరి మహేందర్, మేర్గోజు పద్మ కనకచారి, పంచాయతీ కార్యదర్శి వీణ పాల్గొన్నారు.

**◆ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుల నియామకం**

తొగుట(దుబ్బాక): ఎన్ఎస్‌యూఐ తొగుట మండల అధ్యక్షుడిగా మండలంలోని పెద్దమాసాన్‌పల్లికి చెందిన మెట్టు సురేశ్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నర్సింహారావు బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హుస్నాబాద్: ఎన్ఎస్‌యూఐ హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా కూన విశ్వతేజను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ అనుబంధమైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విశ్వతేజ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

**◆ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం సంఘం జిల్లా బాధ్యుడు యాదగిరి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా లక్ష్మణ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏలు భిక్షపతి, అనిత, పార్వతి, బాబు, కనకరాజు, చాంద్‌పాషా, శివయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ తహసీల్దార్‌కు ఫిర్యాదు**

మద్దూరు(హుస్నాబాద్): తమ భూమిని కబ్జా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మండలంలోని రేబర్తి గ్రామంలోని పలువురు బీసీ, ఎస్సీలు తహసీల్దార్ అనంతరెడ్డికి ఫిర్యాదు చేశారు. 40 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన పట్టాదారు వద్ద కొనుగోలు చేసిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. అయితే ఇళ్లు నిర్మించుకోగా మిగిలిన భూమిలోకి గతంలో భూమిని అమ్మినవారి వారసులు అక్రమంగా ప్రవేశిస్తున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**◆ బెజ్జంకి పోలీస్ స్టేషన్ తనిఖీ**

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను బుధవారం సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. తనిఖీ సమయంలో ఎస్ఐ నరేష్‌రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**◆ 30న గురుపూజోత్సవం**

సిద్దిపేటకమాన్: సెప్టెంబర్ 30న పట్టణంలో గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ట్రస్మా అధ్యక్షుడు మల్లారెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

**◆ వాహనదారులకు జరిమానా**

దుబ్బాక: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని దుబ్బాక ఎస్ఐ గంగరాజు అన్నారు. బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలులేని 14 మంది వాహనదారులకు రూ.2100 జరిమానా విధించారు.

**◆ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి**

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు.